ఈ రోజు జరిగిన సిపిఐ(యం) ప్రెస్ మీట్ నోట్‌ను ప్రచురణార్థం పంపుతున్నాము
– జె.జయరాం

**ప్రజలపై విద్యుత్ భారాలు ఆపకపోతే**
**మరో విద్యుత్ ఉద్యమం**
**ప్రజలపై వేలకోట్ల భారాలు మోపుతున్న ప్రభుత్వం**
**అదానీ, అంబానీలకు దారాధత్తం**
**ఈఆర్‌సి అనుమతి లేకుండా మీటర్ల కొనుగోలు**
**హిందూజాలకు 1200 కోట్లు కట్టబెట్టే యత్నం**

స్మార్ట్, ప్రీపెయిడ్, ట్రూఅప్ ఛార్జీల పేరుతో వినియోగదారులపై వేలకోట్ల భారాలు మోపుతున్నారని, వాటిని ఆపకపోతే రాష్ట్రంలో మరో విద్యుత్ ఉద్యమం నిర్వహించాల్సి వస్తుందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు, కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్.బాబూరావు హెచ్చరించారు. గురువారం విజయవాడలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు.

భారాలపై వినియోగదారులు ప్రశ్నించాలని, ట్రేడ్‌యూనియన్లు, ప్రజా సంఘాలు ముందుకొచ్చి పోరాడాలని కోరారు. వ్యవసాయ మీటర్ల వినియోగదారులపై ఆరువేల కోట్ల భారం పడుతుందని వివరించారు. రెగ్యులేటరీ కమిషన్ అనుమతి లేకుండా మీటర్ల కొనుగోలు చేయరాదని, అయినా ఏకపక్షంగా కొనుగోలు చేశారని తెలిపారు. దీన్ని కమిషన్ ముందుకు వచ్చి విచారించాలని తెలిపారు. శ్రీకాకుళం జిల్లాలో పెట్టిన మీటర్లపై ప్రయాస్ ఎనర్జీగ్రూప్ విచారణ చేసిందని, ఈ నివేదికను బయటపెట్టాలని అన్నారు.

అలాగే హరిత ఎనర్జీ పేరుతో 75 వేల ఎకరాలను అదానీకి కట్టబెట్టేందుకు ప్రభుత్వం పూనుకుంటోందని వివరించారు. మోడీ ఆదేశాల మేరకే రాష్ట్రం ఈ చర్యలు తీసుకుంటోందని తెలిపారు. మన్యం, అల్లూరి జిల్లాల్లో గిరిజనులను రోడ్డున పడేసేందుకు రాష్ట్రం సిద్ధమైందని తెలిపారు. దీనిపై ప్రభుత్వం పునరాలోచన చేయాలని కోరారు. అదానీకి భూములు ఇవ్వొద్దని వారు డిమాండు చేశారు. ఎవరైనా పరిశ్రమలు పెడతామంటే ఇప్పటికే సేకరించిన భూములున్నాయని వాటిని ఇవ్వొచ్చని అన్నారు.

చాలా జిల్లాల్లో పంపుసెట్లకు పెడుతున్న స్మార్ట్ మీటర్ల ద్వారా ఆరువేల కోట్లు భారం పడుతుందని పేర్కొన్నారు. 200 యూనిట్లు వినియోగించే వారికి స్మార్ట్ మీటర్లు పెడతామంటున్నారని, ఒక్కో మీటరు 13 వేల నుండి 14 వేల వరకూ ఖర్చవుతుందని అంటే సుమారు పదివేల కోట్ల రూపాయలు ప్రజలపై భారం పడుతుందని తెలిపారు. 1.20 కోట్ల మంది వినియోగదారులకు మీటర్లు పెట్టడం వల్ల వినియోగదారులకుగానీ, డిస్కమ్‌లకుగానీ ఉపయోగం లేదని పేర్కొన్నారు. విదేశీ కంపెనీలతో జాయింట్ వెంచర్ నిర్వహిస్తున్న అదానీ, అంబానీలకు ఉపయోగమని వివరించారు. ప్రజల నుండి భారాల పేరుతో వసూలు చేసేమొత్తాన్ని వారికి కట్టబెడుతున్నారని వివరించారు.

ఇవి కాకుండా ట్రూ అప్ ఛార్జీల పేరుతో ఏడాదికి మూడు వేల నుండి ఐదువేల కోట్లు భారం విధిస్తున్నారని పేర్కొన్నారు. కేంద్ర ప్రభుత్వం కూడా ఇంకా భారాలు మోపాలని రాష్ట్ర ప్రభుత్వాన్ని ఆదేశించిందని వివరించారు. పవర్ పర్చేజ్ అగ్రిమెంట్ జరగకపోయినా హిందూజాకు దొడ్డిదారిన రూ.1200 కోట్లు కట్టబెట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం న్యాయ సలహా అడుగుతోందని పేర్కొన్నారు.

ట్రూఅప్ ఛార్జీలు అనేది అసమంజసమైనదని, ఆ పేరుతో వేలకోట్లు వసూలు చేయడం సరికాదని తెలిపారు. ఇదే పద్ధతి కొనసాగితే రాష్ట్రంలో తీవ్రమైన పరిస్థితులు ఏర్పడతాయని, దీనిపై వినియోగదారులు తిరుగుబాటు చేయాలని అన్నారు. ట్రేడ్ యూనియన్లు, ప్రజా సంఘాలు ముందుకొచ్చి ప్రతిఘటించాలని కోరారు. ఇప్పటికే మహారాష్ట్రలో ప్రతిఘటన మొదలైందని, ఇంజనీర్లు కూడా వ్యతిరేకిస్తున్నారని వివరించారు.

రాష్ట్రంలో నెల్లూరు జెన్‌కో ప్రాజెక్టును అదానీకి అప్పగించే ప్రయత్నాలను విరమించుకోవాలని డిమాండు చేశారు. ప్రభుత్వం ఇదే పద్ధతిలో ముందుకెళితే 2000 సంవత్సరంలో జరిగిన విద్యుత్ పోరాటం మాదిరే మరో పోరాటం జరుగుతుందని హెచ్చరించారు. గతంలో విద్యుత్ ఛార్జీలు పెంచిన చంద్రబాబు ఇప్పటికీ భయపడుతున్నారని, జగన్ మోహన్‌రెడ్డి "కొత్త పిచ్చోడు పొద్దు ఎరగడు" అన్నట్లు వ్యవహరిస్తున్నారని విమర్శించారు.

విద్యుత్ ఛార్జీలు పెంచబోమని చెప్పి జగన్ మాట తప్పారని పేర్కొన్నారు. 200 యూనిట్ల వరకూ ఉచిత విద్యుత్ ఇస్తామన్న హామీని నిలబెట్టుకోకపోగా దానికి భిన్నంగా వ్యవహరిస్తున్నారని తెలిపారు. గతేడాది విద్యుత్ ఛార్జీలు పెంచి రూ.1400 కోట్ల భారం మోపారని, 2014 నుండి 2019 వరకూ ట్రూఅప్ పేరుతో రూ.2900 కోట్లు 36 నెలలపాటు వసూలు చేస్తున్నారని తెలిపారు. 2019 తరువాత మూడు నెలలకోసారి పెంచే దిశగా ప్రతిపాదనలు పెట్టారని పేర్కొన్నారు. ఇవి కాకుండా అదనపులోడు డిపాజిట్ల పేరుతో భారాలు వేశారని పేర్కొన్నారు. ఎస్‌సి, ఎస్‌టి వర్గాలకు ఉచిత విద్యుత్ కోత పెట్టారని విమర్శించారు. ఉచితం పేరుతో వ్యవసాయ విద్యుత్‌కు ఎసరు పెట్టారన్నారు. ఫెర్రో ఎల్లాయిస్‌పై రూ.790 కోట్ల భారం వేశామని చెబుతూ మిగిలిన అంశాలను వివరించలేదని, ఇప్పటికే రూ.13 వేల కోట్ల లోటు చూపించారని, దీన్ని ఎలా పూడ్చుకుంటారో స్పష్టం చేయలేదని తెలిపారు. దొడ్డిదారిన ప్రజల నుండే వసూలు చేస్తారనే అనుమానాలు కలుగుతున్నాయని వివరించారు.

విద్యుత్ సంస్కరణలు పూర్తిగా విఫలం అయ్యాయని, వాటినే బిజెపి అమలు చేస్తోందని వైసిపి తూచ తప్పకుండా అడుగు ముందుకేసి అమలు చేస్తోందని తెలిపారు. విద్యుత్ రంగంలో కార్పొరేట్ అవినీతికి జరుగుతోందని, 7000 మెగావాట్ల కోసం అదానీ కంపెనీలో సెకీ ద్వారా అడ్డగోలు ఒప్పందం చేసుకుందని తెలిపారు.

**బ్రిటీష్ చట్టాన్ని ఉపసంహరించుకోవాలి**

రాష్ట్రంలో ఊరేగింపుల మీద రోడ్‌షోల మీద బ్రిటీష్ చట్టం ప్రకారం నిషేధం విధించిన ప్రభుత్వం ప్రజాస్వామ్య హక్కులను హరించిందని శ్రీనివాసరావు తెలిపారు. దీనిపై రాష్ట్ర వ్యాపంగా ప్రతిఘటన వచ్చిందని పేర్కొన్నారు. నల్లచట్టాన్ని ఉపసంహరించుకోకపోతే మరింత వ్యతిరేకతను ఎదుర్కోవాల్సి వస్తుందని హెచ్చరించారు. ప్రజల నుండి ప్రతిఘటన వచ్చే కొద్దీ దాన్ని అణచివేయడనికి ప్రజలపై మరిన్ని ఆంక్షలు విధిస్తున్నారని పేర్కొన్నారు. జిఓ నెంబరు ఒకటిని 1861 పోలీసు చట్టం ప్రకారం తీసుకొచ్చినట్లు పేర్కొన్నారని, అది చెల్లదని గతంలోనే సుప్రీం కోర్టు స్పష్టం చేసిందని వివరించారు. 2006లో మోడల్ పోలీసు యాక్టును తీసుకొచ్చారని, అనేక రాష్ట్రాలు దీన్ని అమలు చేస్తున్నాయని, మన రాష్ట్రంలో ఇంకా పాత చట్టాన్ని అమలు చేయడం సరికాదని తెలిపారు. బ్రిటీషు కాలంనాటి రౌలత్ చట్టాన్ని అమలు చేస్తామంటే మరో స్వాతంత్ర్యపోరాట తరహా ఉద్యమం చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు. జిఓ నం.1ని ఉపసంహరించుకునే వరకూ ఉద్యమిస్తామని హెచ్చరించారు.